క్లుప్తంగా

నిర్లక్ష్యం చేస్తే చర్యలు

బోథ్: గ్రామపంచాయతీల్లో కొనసాగే పనులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని డీపీవో శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం బోథ్ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులు పరిశీలించారు. అనంతరం పారిశుధ్య పనులు, డంప్‌యార్డు, శ్మశానవాటిక పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు సకాలంలో ఇంటి పన్ను చెల్లించేలా చూడాలని అధికారులకు సూచించారు.

పోలింగ్‌బూత్‌ల పరిశీలన



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్

నార్నూర్: మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో వసతులు కల్పిస్తామని తహసీల్దార్ జాడి రాజలింగం అన్నారు. గురువారం మండలంలోని నాగల్‌కొండ, బలాన్‌పూర్, సోనాపూర్ పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. మండలంలో మొత్తం 29 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, వాటిలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేరడిగొండ: వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలని ఎఫ్ఆర్‌వో గణేష్ అన్నారు. అటవీ సమీప ప్రాంతాల్లోని పంట పొలాల్లో రైతులు విద్యుత్ కంచెలను ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం మండలంలోని లింగట్ల, కిష్టాపూర్, రాజురా గ్రామాల్లో అవగాహన సదస్సు నిర్వహించారు. కంచెలకు విద్యుత్ అమర్చడంతో వన్యప్రాణులు మృత్యువాత పడుతున్నాయన్నారు. ఎవరైనా చట్టానికి విరుద్ధంగా వ్యవహరిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌వో సవిత, ఎఫ్ఎస్‌వోలు ధనసింగ్, మొహపత్, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

సభ విజయవంతం చేయాలి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్‌లో ఈనెల 28న నిర్వహించే మంత్రి హరీశ్ రావు సభను విజయవంతం చేయాలని డీసీసీబీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు దాసండ్ల ప్రభాకర్ కోరారు. గురువారం మండలంలోని బీర్సాయిపేట, హీరాపూర్ (జే) గ్రామాల్లో కార్యకర్తలు, గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించారు. గ్రామం నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

కల్తీలను అరికట్టేందుకు చర్యలు

ఎదులాపురం: జిల్లాలో వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పిస్తున్నామని కన్జ్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ (సీఆర్‌వో) జిల్లా అధ్యక్షుడు దొమ్మాటి కిరణ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం మాట్లాడారు. జిల్లాలో కల్తీలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల హైదరాబాదులో ధూమపానంపై తాము చేపట్టిన అవగాహన కార్యక్రమాలకు రాష్ట్ర కమిటీ ప్రతినిధులు ప్రశంసా పత్రాలు అందించారని తెలిపారు. సమావేశంలో ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

బోథ్: మండలంలోని కొత్తపల్లె గ్రామంలో పటేల్ కనక శ్యాంరావ్ అనారోగ్య బారిన పడడంతో ఆయనను ఎంపీపీ తుల శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. ఆసుపత్రి ఖర్చుల కోసం రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన నైతం జ్యోతిరాం తల్లి, కొడుకు మృతి చెందారు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. హెచ్ఎం శ్రీకాంత్, సర్పంచ్ బక్కి లలిత చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నర్సయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ భారత్, అంగన్‌వాడీ టీచర్ పుష్పాంజలి ఉన్నారు.

అన్నదానం

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ కాలనీలో గల పురాతన ఆలయమైన బొజ్జావార్ దేవాలయంలో గురువారం అన్నదానం నిర్వహించారు. అంతకుముందు ఉత్సవ విగ్రహానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కాలనీవాసులు, చుట్టుపక్కల వార్డు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు



తలమడుగు మండలంలోని సుంకిడి, భరంపూర్, తాంసి మండలంలోని కప్పర్ల, వడ్డాడి గ్రామాల్లో గురువారం బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. చిన్నారులు, యువతులు వేసి నృత్యం ఆకట్టుకుంది. వెళ్లిరా బతుకమ్మ అంటూ.. సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు. జైనథ్ మండలంలోని గూడ గ్రామంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొన్నారు. మహిళలతో కలిసి ఆడిపాడారు.

– తలమడుగు/తాంసి/ జైనథ్



తాంసి: బతుకమ్మతో మహిళ



తాంసి: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



తలమడుగు: బరంపూర్‌లో..



జైనథ్: బతుకమ్మ ఎత్తుకున్న ఎమ్మెల్యే రామన్న

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీలో శ్రీఉమా రామలింగేశ్వర శివ పంచాయతన ఆలయంలో శివపార్వతుల కల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠాపన చేసి 41 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

– ఆదిలాబాద్

‘రైతుబంధును అడ్డుకుంటున్న కాంగ్రెస్’

బేల: కాంగ్రెస్ రైతు వ్యతిరేకిగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు తాక్రే గంభీర్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కాంగ్రెస్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నవంబర్‌లో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కావాల్సిన రైతుబంధు నిధులను కాంగ్రెస్ అడ్డుకుంటూ.. ఎన్నికల అధికారి ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ జక్కుల మధుకర్, సతీష్ పవార్, వరాడే విఠల్, సాధిక్, గొడే విశాల్, తాక్రే తన్‌బా, గోవింద్‌రావు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ రైతుబంధు డబ్బులు నిలిపివేయాలని ఈసీకి ఫిర్యాదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎంపీపీ గండ్రత్ రమేశ్ అన్నారు. ఈసీకి ఫిర్యాదు చేయడాన్ని నిరసిస్తూ గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని భీంసరి గ్రామంలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఫ్లెక్సీ దహనం చేశారు. రైతుల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే కాంగ్రెస్ ఓర్వలేకపోతుందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు బొమ్మకంటి రమేశ్, జంగు, సెవ్వా జగదీష్, రాజు పాల్గొన్నారు.



బేల: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కాంగ్రెస్‌కు రైతులే బుద్ధి చెబుతారు

ఇంద్రవెల్లి: రైతుబంధు, దళితబంధు పథకాలను ఆపాలంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసిన కాంగ్రెస్‌కు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రైతులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతు సంక్షేమం కోసం బీఆర్ఎస్ రైతుబంధు, రైతు బీమా పథకాలను అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఈ పథకాలను ఆపాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం సరి కాదన్నారు. అనంతరం మానిక్‌రావ్‌తాక్రే దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్‌సింగ్, మర్జీ జీలానిబేగ్, సర్పంచ్ జాదవ్ లఖన్, కనక తుకారం, కనక హనుమంత్‌రావ్, ఆరెల్లి రాందాస్, జాదవ్ ప్రకాష్ పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి: మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

అభివృద్ధి చూసి ఆదరించాలి

కైలాస్‌నగర్: బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసి, రానున్న ఎన్నికల్లో ఆదరించాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ పట్టణ లారీ అసోసియేషన్ సభ్యులు గౌస్, సమీర్, జల్లు, మాధవరావు సెండే, తదితరులు బీఆర్ఎస్ చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. యువత, మహిళలు, వివిధ సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోని ప్రజలకు వివరించాలన్నారు. మహిళలకు రూ.3వేలు, రూ. 400కే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలు ప్రజలకు అండగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, నాయకులు కొండ గణేశ్, అబూజర్, తిరుపతి, బాబా, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ కండువా కప్పుతున్న జోగు ప్రేమేందర్

‘కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు’



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇచ్చోడ: ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులను నమ్మవద్దని ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డిలు అన్నారు. గురువారం మండలంలోని మల్యాల్, యాపల్‌గూడలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత తొమ్మిది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందచేసిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. రానున్న రోజుల్లో వికలాంగులకు, వృద్ధులకు, వితంతువులకు ఫించన్ పెంపు, రైతు బంధు పెంపు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మోహరాజ్ అహ్మద్, గాడ్గే సుభాష్, కృష్ణకుమార్, హరన్ సుభాష్‌పటేల్, సాబీర్, పాండు, దయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఉట్నూర్‌రూరల్: బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని బీజేపీ నాయకులు అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్, బోయవాడ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి రాథోడ్ రమేశ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొండేరి రమేశ్, మండల అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, భాగ్యలక్ష్మి, భగీర్థ, కొమ్ము రాంచందర్, లింగాగౌడ్, రాజేశ్వర్, సతీశ్, దేవిదాస్ పాల్గొన్నారు.

దుండగులను అరెస్ట్ చేయాలి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని గాంధీనగర్‌లో గల బుద్ధ వీహార్‌లోని అంబేద్కర్ నీలి జెండాను ధ్వంసం చేసిన దుండగులను అరెస్ట్ చేయాలని దళిత సంఘం నాయకులు దుర్గం శేఖర్, శోభబాయి తుల్జాపురే, రమాబాయి నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శోభ బాయి దొనే, లత బాయి, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఉద్ధవ్, నాయకులు సూర్యవంశీ, రాహుల్, సూరజ్, సోను, ధమ్మపాల్, విశ్వనాథ్, కాలనీవాసులు పాల్గొన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

గొడవలకు పాల్పడితే చర్యలు

ఇంద్రవెల్లి: గ్రామస్తులు కలిసి మెలిసి ఉండాలని, గొడవలకు పాల్పడితే చర్యలు తప్పవని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్ హెచ్చరించారు. గురువారం మండలంలోని హీరాపూర్ పరిధిలోని లాల్‌టెకిడి గ్రామానికి సందర్శించారు. ఇటీవల జరిగిన ఇరువర్గాల ఘర్షణపై విచారణ చేపట్టారు. గ్రామస్తులు శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని సూచించారు. ఎవరైనా గొడవలకు పాల్పడితే కేసులు నమోదు చేసి, చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ సీఐ రామకృష్ణ, ఎస్సై దుబ్బాక సునీల్, తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న డీఎస్పీ నాగేందర్‌గౌడ్

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

ఇంద్రవెల్లి: రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరను పొందాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులు దళారులకు పంట అమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ మెస్రం కోసేరావ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి రమేశ్, పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్, ఏఈవో కరుణ, సిబ్బంది సునీల్, సురేశ్ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

‘ఆదరిస్తే మరింత అభివృద్ధి చేస్తాం’

బోథ్: బీఆర్ఎస్‌ను ఆదరిస్తే మరింత అభివృద్ధి చేస్తామని బోథ్ జెడ్పీటీసీ సంధ్యారాణి, ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. గురువారం బోథ్ మండల కేంద్రంలో జెడ్పీటీసీ సంధ్యారాణి, జీడిపల్లె, పార్డి(బి), కేశవ్‌గూడ, టివిటి గ్రామాల్లో ఎంపీపీ తుల శ్రీనివాస్ వేర్వేరుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మారుమూల పల్లెల్లో పంచాయతీ భవనాలు, రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మించామన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్‌ను గెలిపించాలని కోరారు.



ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ సంధ్యారాణి

కుమురం భీం విగ్రహం ఏర్పాటు చేస్తాం

ఇంద్రవెల్లి: ఆదివాసీల హక్కుల కోసం పోరాడి అసువులు బాసిన కుమురం భీం విగ్రహాన్ని త్వరలో ఇంద్రవెల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తామని రాయిసెంటర్ల సార్‌మెడీలు మెస్రం వెంకట్‌రావ్, మెస్రం చిన్నుపటేల్‌లు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గోండ్‌గూడలో సమావేశమయ్యారు. కుమురం భీం విగ్రహం ఏర్పాటు, నిధుల సేకరణపై చర్చించారు. కార్యక్రమంలో ఆదివాసీ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయులు మెస్రం దేవ్‌రావ్, కుడ్మేతే గోద్రు, ఆదివాసీ పెద్దలు కుంరం డోంగర్‌రావ్, కుంరం అసేరావ్, కోట్నాక్ భారిక్‌రావ్, సాగర్ పాల్గొన్నారు.



సమావేశమైన రాయిసెంటర్ సార్‌మెడీలు

భీం వర్ధంతి విజయవంతం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలంలోని బట్టి సావర్‌గాం శివారులో సర్వే నంబర్ 72లో గల కుమరం భీంగూడలో ఈనెల 28న నిర్వహించే కుమరం భీం వర్ధంతిని ఆదివాసీలు విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) నాయకులు ఒక ప్రకటనలో కోరారు. తుడుందెబ్బ అనుబంధ సంఘాల నేతలు, రాజకీయ నాయకులు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, ఎంపీపీ, సర్పంచులు హాజరు కావాలని కోరారు.

ప్రజా ఆశీర్వాద సభను జయప్రదం చేయండి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో ఈనెల 28న నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను జయప్రదం చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న కోరారు. గురువారం సాయంత్రం సభ స్థలానికి చేరుకొని ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సభకు మంత్రి హరీష్ రావు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. ఆయన వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు అలాల్ అజయ్, పరమేశ్వర్, పోత రెడ్డి, ప్రశాంత్, ఇబ్బు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

తాంసి: బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి ఓర్వలేకే కాంగ్రెస్, బీజేపీ విమర్శలు చేస్తున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న మండిపడ్డారు. గురువారం ఉండం గ్రామ సమీపంలోని ఫంక్షన్‌హాల్‌లో మండల బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. అంతకుముందు బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ మద్దతుగా భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనిల్ జాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ గోడం నగేశ్, తాంసి జెడ్పీటీసీ రాజు, ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, అరుణ్, రమణ, సదానంద్, మహేందర్, గోవర్ధన్, అశోక్ పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట

ఆదిలాబాద్‌టౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్‌లో గురువారం పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, అష్రఫ్, రాజు, ఎజాజ్ పాల్గొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

నేరడిగొండ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాజుర ఎంపీపీఎస్ పాఠశాలలో సీఎం బ్రేక్‌ఫాస్ట్ (అల్పాహార) పథకాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. తరగతులు ప్రారంభం కంటే అరగంట ముందు విద్యార్థులకు టిఫిన్ అందించడం జరుగుతుందన్నారు. సోంబార్ ఇడ్లీ, పూరి, ఆలూ కుర్మా, ఉప్మా, వెజిటబుల్ పలావ్, ఉగ్గాని ఇలా రోజుకో అల్పాహారం అందించేలా మెనూ ఖరారు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాం అనిల్, ప్రధానోపాధ్యాయురాలు మల్లీశ్వరి, ఎస్ఎంసీ సభ్యులు పాల్గొన్నారు.



అల్పాహారం ప్రారంభిస్తున్న ఎంఈవో భూమారెడ్డి

అల్పాహారం అందించాలి

నార్నూర్: విద్యార్థులకు ప్రతిరోజు అల్పాహారం అందించాలని నార్నూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు పవార్ అనిత అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు అందించిన అల్పాహారాన్ని ఆమె పరిశీలించారు. అల్పాహారంలో నాణ్యత పాటించాలన్నారు. ఆమె వెంట ఉపాధ్యాయులు రాథోడ్ రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం’

జైనథ్: బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు, ఆదిలాబాద్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్ అన్నారు. మండలంలోని దీపాయిగూడ, ఆనంద్‌పూర్ గ్రామాల్లో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జోగు రామన్న ప్రజా సమస్యలను పట్టించుకోలేదన్నారు. పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని మభ్యపెట్టి, హామీలను విస్మరించారని ఆరోపించారు. ఆదిలాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు బీజేపీకి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాందాస్, కరుణాకర్ రెడ్డి, లోక ప్రవీణ్ రెడ్డి, బోయర్ విజయ్, రత్నాకర్ రెడ్డి, చిలుకూరు జ్యోతిరెడ్డి, మయూర్ చంద్ర, కృష్ణ, రమేశ్, అష్టక్ సుభాష్, సామ రమేశ్ పాల్గొన్నారు.



గ్రామస్తులకు చాయ్ అందజేస్తున్న పాయల్ శంకర్